కథా నిలయం
5296
శ్రీకాకుళం

# స్వగతాలు

## ఎదురు మేడలు

నగరంలో మధ్యలో, గ్రామీణ పట్టణ వాతావరణాల చిత్రంలోని రెండు రంగుల కలగలుపులా, ప్రతిబింబిస్తున్న ఆ ప్రదేశంలో తూర్పు వైపున రెండు మేడలున్నాయి. ఒక మేడ పశ్చిమంగా ముఖం పెట్టుకుని తూర్పువైపు వ్యాపించింది. మరొక మేడ ఉత్తరంగా ముఖం పెట్టుకుని దక్షిణంవైపు వ్యాపించి, తూర్పువైపు వ్యాపించిన మొదటిమేడ వెనక భాగమంతా చూస్తోంది. మొదటి మేడ ముఖంనుంచి వెనుకదాకా నడిచి నూటయిరవై డిగ్రీలతో రెండో మేడవైపు పయనించి, అక్కడినుంచి తిరిగి మొదటి మేడ ముఖం దగ్గరకువస్తే, ఒక త్రిభుజాకారము ఏర్పడుతుంది. నూటయిరవై డిగ్రీలకు ఎదురుగా ఉండే భుజ ప్రాంతమంతా ఆరుబయలు. మొదటి మేడ ముఖం ఎదురుగా ఆరుబయలు నానుకుని, రహదారి మెలికల పాములా చాచుకుని నడుస్తోంది. రహదారి కవతల గుడిసెలు, పొలాలు, ఫ్యాక్టరీ, చిన్న అమ్మవారి గుడి, పిప్పల వృక్షాలు ఇవతల అన్నీ ధనవంతుల మేడలు-వ్యాపారస్తుల అంగళ్ళు, పెద్ద హోదాలవారి స్తోమత పరవళ్ళు స్పష్టంగా కనిపిస్తాయి.

మొదటి మేడ వెనుకభాగం ఒక గుండ్రని ఆవరణ, పైన సిమెంటు కప్పు ఆ ఆవరణకు పూర్తిగా నీడ యిస్తుంది. అక్కడనుంచుంటే ఎదుటి మేడ క్రిందభాగం కాంపౌండులోని మొక్కలతోట అద్దాల కిటికీలు, సగం కర్టెన్‌లు తొడుక్కున్న కిటికీల ఊచలమధ్య నుంచి కదులుతున్న మనుష్యుల శిరాలు గోచరిస్తాయి. రెండో మేడ క్రింద కాంపౌండులో కాని, పైనున్న మధ్య వరండాలో కాని ఎవరు నిలుచున్నా మొదటి మేడ వెనుక గుండ్రని ఆవరణ అందులోని పూల కుండీలు, వంకీల సిమెంటు కన్నాలలోంచి తొంగిచూచి పలకరించే ఎర్ర గులాబీలు, అందులోంచి గదుల ద్వారాల సన్నని కర్టెన్‌లు, గాలికి రెపరెపలాడుతూ కుంచించుకుంటున్న కర్టెన్‌లు వదిలివేసిన నగ్న వాతావరణంలో మనుష్యుల కదలికలు స్పష్టంగా కనిపిస్తాయి.

నాటి సంక్రాంతి వచ్చేవరకు ఎదురు వేపలు నీడల్లో నిద్రపోతే కాని ఆసక్తితో శల్య పరీక్ష చేసుకోవలసిన అగత్యం ఏర్పడలేదు. ఒక సంవత్సరంలో...

**సంక్రాంతి ఉదయం : 6-30 గంటలు.**

**నీలవేణి**

అబ్బ ఎంత అందంగా ఉంది ఆ మేడ. ఉదయ కిరణాల బంగారు రంగులో విచ్చుకుని ఊగుతున్న గులాబీలు, చల్లగాలి కదలికల్లో నృత్యం చేసే ద్వారాల కర్టెన్లు, సొగసుగా హుందాగా ఉంది. ఆ మేడలో ఎంతకాలం చూసినా ఎవరూ జనం కనపడరేం? ఆయన తప్ప అంత పెద్ద మేడలో ఒక్క మనిషి ఎలా ఉండగలడో, భయం వెయ్యదూ? పగలు ఇంట్లో వాళ్ళంతా బయటికి వెడితే ఏమిటో బిక్కుమని భయపడతానే! ఆయన ఏం చేస్తాడో, పక్కయింటివాళ్ళ సంగతి పట్టించుకున్నట్టే ఉండడు. రాత్రి ఒంటిగంటకు లైటు వెలుగుతుంది. ఒంటి గంటదాకా నిద్రపోడా ఆయన? రాముడూ, మల్లమ్మ ఆ ఎదురు మేడవారింట్లో పని చేస్తోందా? అవునమ్మా ఉహు, ఇటువంటి చిన్న పువ్వుల లత ఎదురు మేడ ఆవరణలోని గుండ్రని గోడమీద ఎక్కిస్తే, పొద్దున్నే సూర్యుడు ఉదయించే ఈ కాంతిలో చాలా అందం యిస్తుంది. ఈ వేళ పండుగకూడా. దాసీది వస్తే బాగుండును. ఎన్ని పనులో? తలంటుకుంటే తలమీద సగం బరువు తగ్గినట్లుంటుంది. రాముడూ - నా గదిలో మేజా మీద దువ్వెన తీసుకురా? కాస్త తల విప్పుకుంటేకాని! ఆయన లేచినట్లున్నాడే, నిద్రమత్తులాగుంది. తూలుతూ నడుస్తున్నాడు. బాగుంది. చారల చొక్కా తానూ, ప్రొద్దుటెండలో బలేగా వున్నాడాయన. దాసీదానికి ఎంత జీతమిస్తాడో? దర్జాగా ముఖం కడుక్కుంటాడు కాబోలు - నీళ్ళు కూడా అందిస్తోందీ మల్లమ్మ. మల్లమ్మని మన సంగతి ఏమన్నా అడుగుతాడా ఆయన? బహుశా తన గొడవే తనదేమో? ముఖం కడుక్కోవడం అయింది కాబోలు. బలేగా వుంది రంగుల తువ్వాలు. ఆయన బట్టలన్నీ రంగులవే. గులాబీలంటే యిష్టం కాబోలు-మొక్కలు పరిశీలిస్తున్నాడు ఆయన. మా కంపౌండులో యిన్ని మొక్కలున్నాయి ఒక్కమొక్క యిమ్మని ఎప్పుడూ కబురైనా పంపడేం? ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కో తమాషా-మల్లమ్మని అడగాలి ఆయన్ని గురించి. ఎందుకూ-ఆయన ముఖం యిటు త్రిప్పేలా చేస్తాను. రాముడూ, మల్లమ్మకు యింకా పని కాలేదనుకుంటా. పెద్దయ్య నిద్రలోంచి లేచారా? నాన్నగారు కూడా లేవలేదనుకుంటా కొంచెం చూడు, మళ్ళీ కాఫీలు తయారు చేయాలి. మల్లమ్మని

పిలు రాముడూ, ఇదిగో వరండాలోకే వచ్చింది. చేతిలో దుమ్ముకాబోలు, యిల్లు తుడిచి ఉంటుంది. పిలుస్తే పిలవాలి. మంచి ఆలోచనే .మల్లమ్మా! మల్లమ్మా! కొంచెం త్వరగారా యింటి నిండా చాలా పనులున్నాయి. ఈ రోజు పండుగ కూడా? యిటు తిరగడే ఆయన, అరుస్తే తిరగడూ? వస్తున్నానమ్మా. మల్లమ్మని ఏదో అడుగుతున్నాడు. కొంపదీసి నన్నుగురించా? ఛ-ఎందుకు పిలిచాను గట్టిగా-పెద్దమనిషి- ఆయన ఏమనుకుంటాడో. ఎదురు మేడలోని ఆడవాళ్ళు యిలాగే అరుస్తారనుకున్నాడేమో-బలేదాన్ని. యింట్లోకు పోయి కాఫీలు పెట్టాలి.

## శంకరం

ఎవరావిడ? ఆ బంగలా చౌదరిగారి కూతురనుకుంటా – మల్లమ్మని అడిగితే – మనకెందుకు ఆడవాళ్ళ విషయాలు. వంకీల జుట్టు, కోల ముఖం అందమైన మనిషే! మల్లమ్మా! ఏం బాటూ అబ్బే ఏంలేదు. వాళ్ళ కాంపౌండు ఎంత బాగుందో, నేనింతవరకు జాగ్రత్తగా చూడనేలేదు. ఎన్నిరకాల మొక్కలు, పువ్వులు, తీగలు అవునా? అనుకూలమైన గృహిణి చల్లదనం-ఆ ఇంటికి అందం యిచ్చి ఉంటుంది. చౌదరిగారు చాలా పెద్ద వ్యాపారస్తుడంటారు డబ్బున్నవాళ్ళకు అలంకారాల కేమిలోటు? డబ్బు లేకపోయినా, ఉన్నదంతా ఖర్చు పెడుతూ పెద్ద హోదా చూపిస్తున్నాను. మునుపు ఎక్కువ కనిపించలేదే యీవిడ, ఈ మధ్యనే వచ్చిందేమో, తండ్రిని చూడ్డానికి రావచ్చు. ఆవిడ స్వయంగా మొక్కలకు నీళ్ళు పోస్తోంది. మొక్కలంటే యిష్టం కాబోలు నాలాగే. ఆవిడ పేరుకి ఎంత పెద్దజడ నల్లత్రాచులా! ఇక్కడినుంచి చూస్తుంటే నల్లత్రాచు పడగ విప్పినట్లుంది, ఆమె వెన్నెముక మీద. తండ్రి. భర్త అదృష్టవంతులు. లక్షణమైన మనిషి – ఎంత తియ్యని కంఠం మల్లమ్మా! రోజూ యిలా పొద్దున్నే మన మేడవైపు చూస్తూ ఆమె కేక పెడితే-ఆలస్యంగా లేచే నాకు మేలుకొలుపు ఒకటి, రెండు-చౌదరిగారు టాక్సీల వ్యాపారం చేస్తారా? ఏమో, ఆవిడ కొడుకు కాబోలు. ముద్దు పెట్టుకుంటోంది. తల్లిప్రేమ. చౌదరిగారు కూడా నాలాగే ఆలస్యంగా లేస్తారు కాబోలు. పుల్లపెట్టి పళ్ళు తోముకుంటున్నాడే, నాగరికతకు కొంచెం దూరమేమో మా తాతయ్యలాగా! మల్లమ్మా, అది చౌదరిగారి మేడకదూ! అవునుబాబూ. మేడ చాలా అందంగా ఉంది. ముప్ఫై వేలు ఖర్చు పెట్టారంట బాబూ! ఓరి! నా జీవితమంతా ఖర్చయినా ముప్ఫై వేలు సంపాదించలేను. మల్లమ్మా! త్వరగా వంట చెయ్యి, అర్జంటు పనుంది.

## నీలవేణి

సుష్టిగా భోంచేశాక తమలపాకులు నములుతే ఏమిటో మత్తుగా. ఆనందంగా ఉంటుంది. ఈనెలు తీసి, చిలకలు చుట్టి వారికి యిస్తే ఎంత సంతోషం. నాన్నకు కూడా కిళ్ళీ అంటే చాలా సరదా. ఈ వేళ చేసిన మైసూరుపాకం సరిగా రానేలేదు - మల్లమ్మ ద్వారా ఆ మేడమీద ఆయనకు పండుగ తీపి పంపిస్తే - ఏమో- ఏమనుకుంటాడో. ఇంట్లో ఆడవాళ్ళయినా లేరు, ఒకసారి పలకరించి స్నేహం చేసుకోవాలన్నా, అర్ధరాత్రి వరండాలో కూర్చుని ఏదో రాస్తుంటాడు. తొమ్మిదిగంటలు దాటితే నాకు నిద్ర ముంచుకొస్తుంది. ఆయన రాత్రిళ్ళు ఎలా మేల్కొంటాడో - పాపం, మల్లమ్మ చేసిన భోజనం తింటాడు కాబోలు, తల్లీ, తండ్రి ఉన్నారో లేదో! ఎవరూ బంధువులుకూడా వచ్చినట్లు కనిపించరు. రెండు నెలల నుంచి చూస్తున్నా. కాస్త ఈ కిటికీ తలుపు తెరిస్తే గాలి బాగా వస్తుందేమో -అరె- ఆ మేడమీద తలుపులన్నీ మూసిఉన్నాయే- పండుగనాడు కూడా యింట్లో ఉండడా ఖర్మ, బలే తిరుగుడుమనిషే! పండుగనాడు ఆఫీసు ఉంటుందా? స్నేహితులు భోజనానికి పిల్చేరేమో. ఆయన సభల్లో మాట్లాడ్డం వారు చూశారన్నారు. ఏం మాట్లాడతారో ఆయన.• అయినా, అంత అద్దె యించ్చుకుంటూ ఒక్కడూ ఆ బంగళాలో ఉంటే అనవసరంగా డబ్బు ఖర్చు కదూబాగా సంపాదిస్తున్నాడేమో? అయినా, నాకెందుకు యీ ఆలోచనలు ఆయన గురించి. మల్లమ్మకు పండుగబహుమతి అయిదు రూపాయలు యిచ్చేడుట. నేనెప్పుడూ అంత డబ్బు పండుగనాడు ఎవ్వరికీ యివ్వలేదు. ఆ మేడ చూస్తే భయం వేస్తుంది, ఏదో మాయా గృహంలా!

## ఎదురు మేడ

గుండ్రని వరండా. పిచికలు ఎగురుతున్నాయి. వ్రేలాడుతున్న పంజరం ఊగుతోంది. మొక్కలు గాలికి కదులుతున్నాయి. మూసిన తలుపులకు అంటిపెట్టుకున్నాయి రంగుల కర్టెనులు. ఒక కాకి వచ్చి గట్టిగా కావుమంటూ అరుస్తోంది. వరండాలోకి సగం చొచ్చుకున్న మిట్ట మధ్యాహ్నపు ఎండలో మొక్కలు తళ తళలాడుతున్నాయి. పూర్తిగా నిశ్శబ్దం, గోడమీద నల్లపిల్లి కూర్చుని గస్తీ కాస్తోంది.

## నీలవేణి

అబ్బ! ఈ సినిమాల పిచ్చి వారికి ఎన్నేళ్ళు వచ్చినా తగ్గేలా లేదు. పండుగనాడు

కాస్త యింటిలో వుంటే ఏమొచ్చిందో. నాన్నకూడా యింకా యింటికి రాలేదు. ముసలాడయిపోయినా లక్ష పనులు ఆయనకు పోరు పెడితే వారు సాయంత్రం పార్కుకు తీసుకువెళ్ళారు ఎంచేతో యింట్లోకంటే ఐదు నిమిషాలు పార్కులో కూర్చుంటే హాయిగా వుటుంది! అదేమిటి, చాలా చిత్రంగా వుందే- కొలను ప్రక్కన బెంచీక్రింద పార్కులో పచ్చగడ్డిమీద ఆ ఎదుటిమేడ ఆయన దొర్లుతున్నాడే! మమ్మల్ని చూడలేదనుకుంటా. ఇంత మేడ వదులుకుని పార్కులో పడుకున్నాడేమిటి? పైగా ఇస్త్రీ బట్టలు, టై వేసుకుని పచ్చగడ్డిమీద దొర్లడమేమిటి? పదిమంది వస్తుంటారు. పోతుంటారు పార్కులో. రాళ్ళను కొలనులోకి విసురుతున్నాడు ఏదో ఆలోచిస్తూ ఏమి ఆలోచనలో, వారు కూడా చూసేవుంటారు. వారితో, ఆయనగురించి మాట్లాడ్డమెందుకు? అబ్బ! రాత్రి పది గంటలయింది. నాన్న యింకా రాలేదు. కారు హారనులాగుందే. నాన్నకారే నాన్న, అల్లుడు యింటికి వచ్చాడా అమ్మాయి సినిమాకి వెళ్ళారు. నిన్ను తీసుకు వెళ్ళలేదా? నాకు తలనొప్పిగా ఉంది. నాన్నకు భోజనం పెట్టి నేనుకూడా పడుకుంటాను. పన్నెండు, అబ్బ! నిద్ర రావటం లేదు. ఆ ఎదురుమేడలో ఇంకా చీకటే! ఆయన యింటికి ఇంకా రాలేదేమో? ఎక్కడ తిరుగుతున్నాడో. అరె, లైటు వెలిగిందే ఆ మేడలో. ఈ ప్రక్కమీద పడుకుని కిటికీలోంచి చూస్తే ఆ మేడలో ఏం జరిగేదీ అన్నీ కనిపిస్తాయి. వరండాలోకి వచ్చి ముఖం కడుక్కోడానికి బాత్‌రూమ్‌లోకి పోయాడు. వరండాలో లైటు ఆర్పేసేడే. చీకటిలోనుంచోడం సరదా కాబోలు. నిశ్శబ్దమైన ఆరుబయలు చూస్తున్నాడు. అరే నా కిటికీ వైపు చూస్తున్నాడా. నా తల కనిపిస్తోందేమో. చూడనీ, నేనూ ఆరుబయలుకేసి నిశ్శబ్దంగా చూస్తున్నాను. అంతేనా, వరండాలో మళ్ళీ లైటు వేసాడు. పుస్తకాల దొంతరలుఇంకా చదువుతాడు కాబోలు. నిద్ర రాకుండా. ఆయన మందేమన్నా తిన్నాడా, బలే చిత్రమైన మనిషి. వస్తున్నా అబ్బ నిద్ర చెరుపు-హాయిగా సినిమా చూసి వచ్చేరులాగుంది వారు. అరే ఆ ఎదురుమేడ యింకా లైటుతో వెల్గుతోందే. ఎమండీ, సినీమా బాగుందా. ఓ, నీలాంటి సినీతార ఒకతె నృత్యంచేసి మనస్సు అదరగొట్టేసింది. ఆ సినీతార వెంట పోలేకపోయారు? అదే ఆలోచిస్తున్నా వంటింటిలోని పాలు, పళ్ళు తీసుకొని పడుకోండి. నాకు నిద్ర తూలుస్తూంది. ఏమే, ఇదిగో మాట. అబ్బ, ఏమిటి ఇది, నాకు నిద్ర వస్తుంది. సినిమాల్లోని శృంగారం నా మీద ఒలకబోస్తే ఎలా? వంటింటిలోకి వెళ్ళి పాలుతీసుకోండి. అబ్బా-ఒళ్ళంతా పుండులా వుంది. ఆ మేడమీద ఆయన కూడా లైటు ఆర్పి పడుకోకూడదూ. పాపం (నవ్వుకుంటుంది) ఏమిటో జీవితం!

**ఉగాది! సాయంత్రం 4 గంటలు.**

**శంకరం**

ఈ రోజు ఉగాది. ఈ జీవితంలో ఇరవై ఏడు ఉగాదులు గడిచిపోయాయి. నిస్సారంగా వేప పువ్వులా చేదుగా ఉంది. అబ్బ, ఉగాదిపూట హాయిగావిద్దాను- తక్కిన సంవత్సరమంతా హాయిగా ఉండొచ్చు. ఒక సిగరెట్టు కాలిస్తే వరండాలోని మొక్కలు, పంజరంలోని చిలక-వెన్నంటిబ్రతికే నల్లపిల్లి-నాతో పలకరించి ఎగిరే పిచికలు లేకపోతే నాకీ ఒంటరితనం ఇంకా బాధగా ఉండేది. మనిషికంటే, జంతువులు, పక్షులు ఎక్కువ స్నేహంగా వుంటాయి. ఆ కోలముఖం అమ్మాయి కిటికీలోంచి నావైపుచూస్తోందే ఎందుకు? నవ్వు వస్తోంది. విరాగ హృదయం - చుట్టూ ఏర్పడే వాతావరణం వ్యర్థం. నేను చూస్తున్నానని సిగ్గుపడి వెళ్ళిపోయింది. కిటికీ దగ్గరనుంచి కాంపౌండులోకి వచ్చింది పిల్లవాడితో. కొత్తచీర కట్టిందే ఆవిడ. పండుగ ముస్తాబు కాబోలు! మొక్కల తోటలో తిరుగుతోంది. బరువుగా నడుస్తోందే. పిల్లవాడు కథలు చెబుతున్నాడులాగుంది. తల్లికి అరే, అర్థమయింది. ఆ ఒంటి పిల్లాడికి ఆడుకునేందుకు మరో పాపనియిస్తుందన్నమాట ఆవిడ, తల్లి ప్రేమ. ఆ కోలముఖం, అదే రకమైన ముఖం నన్నాశలు పెట్టి నన్నిశోకంలో ముంచింది. నా ఆవేదన ఎవరికి కావాలి. జీవితంలో నిజమైన అనురాగం చూపడం తప్పా. ఆ తప్పు చేసిన పాపం జీవితమంతా క్షోభ పెడుతుంది. నేను నశించినా పర్వాలేదు. నా కంటికెదురుగా అందరూ ఆనందంగా వుంటే అంతేచాలు. చౌదరిగారు కారులో వెడుతున్నారెక్కడికో, ఆవిడ పిల్లవాడిని తీసుకొని కాంపౌండు బయటికి వచ్చిందే-తాతగారు మనమడిని ముద్దు పెట్టుకుంటున్నారు. తన తరంమీద అభిమానం గట్టిది ముసలి చౌదరికి కారు ఖరీదు పాతిక వేలయినా వుంటుంది. ఎంత దుమ్మో-వెనకాల మేఘంలా లేచింది. ఆ మేఘంలోంచి ఆవిడ, పిల్లవాడు - యీ వైపు వస్తున్నారే. అంతగా ఆమెవైపు చూడడం బాగుండదు. సిగరెట్టు పొగలు ఆకాశంలోకి వదులుతూ చూస్తా పైకి. అరె-ఆవిడ నావైపు చూసింది. చురుక్కున గబుక్కున తలతిప్పిందా. నేను జీవితంలో ఒక చోద్యమైన మనిషిని. మ్యూజియంలో ఒక వింతజంతువుగా జనం నాకేసి చూడవచ్చు. ఎక్కడికయినా ఒంటరిగా పోయి తిరిగి రావాలి! ముఖం కడుక్కుని.

**నీలవేణి**

మొదట్లో పెళ్ళయినప్పుడు సాయంత్రం వారు షికారు తీసుకు వెళ్ళేవారు. ఇప్పుడు? ఏమిటో షికారులంటే అసహ్యం. పిల్లవాడితో కాస్త కబుర్లు చెప్పుతూ ఉంటే కాలక్షేపం

అవుతుంది. నేను మేడ క్రిందనుంచి వెడుతూంటే ఆయన చూశాడు. ఏమనుకున్నాడో ఆయన. ఎందుకు ఒంటరిగా వుంటున్నాడు? పెళ్ళి అయిందో లేదో. భగ్నప్రేమికుడా? విజయనగరంలో ఒకాయన మా ఇంటిప్రక్కనే వుండేవాడు. జుట్టు రేపుకుని మాసిపోయిన లాల్చీతో, గెడ్డంతో తిరుగుతుండేవాడు. ఆయన ప్రేమని ఎవరో అమ్మాయి కాదందట. బలేవాళ్ళు మగవాళ్ళు - ఎందుకో అంత పిచ్చి కాని యీయన అలాగ వుండడు, ఏమయినా పెద్ద శాస్త్రాల్లో పరిశోధన చేస్తూంటాడేమో - సంక్రాంతినాడు పంపిన మైసూరుపాకలు తిన్నాడో లేదో. మా నాన్నకు మైసూరుపాకం అంటే యిష్టం - ఈ పండుగకు పిండివంటలు చెయ్యడానికి ఒపిక లేదు-నాన్న వద్దన్నారు. ఇదేమిటి, ఈ రోడ్డుమీద చాలాదూరం వచ్చేశాను. తిరిగి యింటికి పోవాలి, నానీ, యింటికి పోదాం. నాన్న వస్తారు. జిలేబీలు తెస్తారు. అమ్మా నాకొక యీల కొనిపెత్తవే-అలాగే. ఆ మేడలో ఆయన మళ్ళీ వీధుల్లోకి బయలుదేరాడులాగుంది. ఎదురుగానే వస్తున్నాడు. ఎక్కువగా చూస్తే బాగుండదు. నన్ను చూస్తున్నట్లున్నాడు. నానీ కారు తప్పుకో. యిల్లారా, అరె, ఆయన పట్టుకున్నాడే కుర్రాడిని. నయం-కాస్త తప్పితేకారు ప్రమాదం జరిగేది. మీ అబ్బాయాండి? అవునండి. కొంచెం జాగ్రత్తగా ఉండాలి వీధుల్లో. ఆయన బలేగా నవ్వుతాడే. ఎంత అందం ఆయన ముఖం నవ్వుతూంటే. వెనక్కి తిరిగిచూస్తే అరే, ఆయన వెనక్కి తిరిగి చూస్తూ వెడుతున్నారే, ఛ! ఏమిటే ఆలోచనలు-ఎవరికి వారే యమునా తీరే.

## దసరా రాత్రి 12 గంటలు

### శంకరం

అరె! ఆ మేడలో పూర్తిగా లైట్లు వెలుగుతున్నాయే! ఏమిటి అంతా కంగారుగా తిరుగుతున్నారే. రెండు కార్లు వచ్చాయే. లేడీడాక్టరు లాగుంది. మందుల బేగ్, స్టేతోస్కోపు. నెలరోజులనుంచి ఆవిడ కాంపౌండులో ఎక్కడా కనిపించటంలేదు. ప్రసవిస్తోందేమో, కావచ్చు. సృష్టి కర్త లీలలు, ఎదురింటి మేడలో కలకలలాడుతూ ఇంకో పాప పుడుతుందనుకుంటా. ఆవిడ భర్త కాబోలు, డాక్టరుని లోపలికి తీసుకువెడుతున్నాడు. అద్దాల కిటికీల్లోంచి ఆ మేడ హోయలు తీవి ముద్దువస్తోంది. ఆ గర్భవతి నిండు ఆకారంలా. ఆమె చూపులో ఎంతో సమ్రత, ఆర్ద్రత, ఆకర్షణ వున్నాయి. నిజంగా మాతృమూర్తి. అభిమానం తొణుకుతున్న మానవాకారం,

ఒక్కొక్కరిని చూస్తే ఏమిటో మనస్సులో హత్తుకు పోతారు చిత్రం. ఏమిటి ఏవో కేకలు వినపడుతున్నాయి.

## నీలవేణి

ఏమిటీ బాధ-నేను భరించలేను. మనసారా ఏడ్వాలని ఉంది. డాక్టరు చూస్తోంది శరీరం. చూడనీ నాకే? నాకేం అక్కర్లేదు ఈ ప్రపంచంలో నేను చనిపోతానా ఏమో, ఆయన ఈ కిటికీ ఊచల్లోంచి కనిపిస్తున్నాడు. మేడమీద సిగరెట్టు కాలుస్తూ నా కిటికీవైపు చూస్తూన్నాడే! ఎదురింట్లో "ఏం జరిగేది చూడాలని ఆయనకీ ఉంది ఆసక్తి అవును - అర్ధరాత్రి యింట్లో యింత హడావుడిగా తిరుగుతూంటే ఏమౌతుంది? అబ్బా! డాక్టరమ్మగారూ! ఏం భయం లేదమ్మా- గుండెల్లో నొప్పి మందిస్తాగా. అమ్మో బాధ భరించలేను.నాకీ బాధ వద్దురోయి. ఇస్, ఏమిటమ్మా ఆ అరుపులు? మెల్లిగా- ఒక్కక్షణం ఈ మందు తీసుకోమ్మా- డాక్టరమ్మగారూ ఇంట్లో లైట్లు వెయ్యండి. ఇంత చీకటిగా ఉందే? లైట్లు అన్నీ వేసిఉన్నాయిగా. లేదండి అంతా చీకటిగా వుంది. ఆయన కనిపిస్తున్నాడు ఎవరు? ఎవరో హిహిహి. బాధ లేదు. లేదు. సుఖంగా ఉంది. ఏమండీ, నానీని పిలవండి. నానీ, నన్ను మర్చిపోకేం - గుండెల్లో నొప్పి డాక్టరమ్మగారూ, ఇంకో పాపని, నేను చూడగలనా? నాకు బాధ ఆ, ఏడుపువస్తోంది. డాక్తరమ్మగారూ, నాన్నా, అబ్బ, నేను యింక బ్రతకను. ఆ ఎదురింటి మేడలో పూర్తిగా చీకటి. చీకటిలో సిగరెట్టు నిప్పు శుక్రనక్షత్రంలా వెలుగుతోంది. నాన్నా, వారు ఏరీ? యిలా రమ్మను. నానీని జాగ్రత్తగా చూడండి.

## శంకరం

అరే! ఏడ్పులు వినిపిస్తున్నాయే, కొంపదీసి ఏమన్నా ప్రమాదం జరిగిందా? డాక్టరమ్మ దిగాలుగా మొగం పెట్టుకుని బయటికి వస్తోందే చౌదరిగారు నిర్ఘాంతపోయి కాంపౌండులో నిలుచున్నారే. ఆవిడ భర్త తల వంచుకుని మందులపెట్టె కార్లో పెడుతున్నాడే. ఏడుస్తున్నారు. నిజంగా ఏడ్పులే. ఆవిడ చనిపోయిందా. కిటికీలోంచి కనిపిస్తోంది. మంచంమీద మనిషి. కదలిక లేకుండా ఆవిడ చనిపోయిందన్నమాట. పాపం కోలముఖం, పొడవైన జడ, ఎంత అందమైన మనిషి. ఒక్కగానొక్కకూతురు చౌదరిగారికి. ఆయన దీనిని భరించలేడు. భర్త ఏం విచారిస్తున్నాడో. ఆ కుర్రాడు

నానీ ముద్దొస్తున్నాడు. ఎవరు పెంచుతారో. ఎంత ధనముంటేనే. శోకం తప్పదు. చౌదరిగారి హృదయానికి పెద్ద దెబ్బ. ఎదురింటి శోకం చూస్తోంటే యింక నాకు నిద్రేమొస్తుంది?

**దీపావళి: రాత్రి:12 గంటలు.**

### -శంకరం

ఎదురుమేడ తాళం వేయబడింది. చౌదరిగారు అన్నగారింట్లో ఉంటున్నారని మల్లమ్మ చెప్పింది. ఆవిడ యింట్లో చనిపోయింది. అందుచేత కొన్నాళ్ళు ఆ మేడలో నివాసం ఉండకూడదనుకున్నారేమో. ఆవిడ బ్రతికుంటే, పాపని కనివుంటే, ఎదురుమేడ దీపావళి తోరణాలతో కలకలలాడుతూ ఉండేది. ఆ మేడలో చీకటి కరుడు కట్టింది. ప్రక్కయింటి అరుగుమీద ప్రమిదల్లో కొడివత్తులు నిలుచున్నాయి. తారాజువ్వలు ఎగురుతున్నాయి. ఔట్ల శబ్దాలు చీకటిని, నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నాయి.

ఆకాశంలో తారలతో దాగుడుమూతలాడుతున్నాయి దీపావళి సరంజామా అనంత నీలి గగనంలో తళుకులు, వెలుగులు, భూమి సృష్టించి విడిచిన కృత్రిమ వెలుగులు. దూరాన చెట్లు నిశ్శబ్దంగా నిలుచున్నాయి, అరే, వాన తుంపర పడుతోంది. విద్యుద్దీపాల కాంతిలో చెట్లు చెమరుస్తున్నాయి కన్నీళ్ళు. బహుశా చౌదరిగారి చీకటిమేడ చూసి కాబోలు. బుల్ బుల్ తారా వాయిస్తే చీకటి నిశ్శబ్దానికి ఒ ఆలాపన. కోల ముఖం. వంకీల జుట్టు ఆవిడ నవ్వు ఎంత హాయి చనిపోయింది. ఆ ఎదురుమేడలో అంధకారాన్ని వదిలింది. ఆమె యింక కనపడదు తారాజువ్వ! అబ్బ, ఎంత ఎత్తుకుపోయింది ఆకాశంలోకి. తెల్లటి వెలుగు చుక్కలు తారాజువ్వ రాలుస్తోంది. తిన్నగా చౌదరిగారి మేడమీద రాలుతున్నాయే. ఏమిటా వెలుగు చౌదరిగారి మేడ వెనకాల ఎవరైనా చిచ్చుబుడ్డి వెల్గించారా? వెలుగు కాదే-మేఘమా-కాదే తెల్లటి జుట్టుకు సిల్కు చీరా? కాదే ఆకారం కోలముఖం, వంకీలుజుట్టు, బుల్ బుల్ తార తీగ తెగింది. ఆవిడ నాకేసి చూస్తోంది. లైటు వేస్తే? వద్దు ఔటు చప్పుడు ఎదురు మేడమీద వెలుగు లేదు. చీకటి ఆకాశంలో చుక్కలు మాత్రం బిక్కుబిక్కుమంటూ నాకేసి చూస్తున్నాయి, నా కనుపాపల్లా ఎదురుమేడలు చీకటిలో నిండుకున్నాయి. ఎదురు చుక్కలు చెదురు మనసులు ఆరుబయలులో నిశాకన్య పెట్టిన గుడ్డి విద్యుద్దీపం మిగిలి ఉన్నాయి ఆ నాటి దీపావళి రాత్రి.